**"ఓం గం గణపతయే నమః"**

**"ఓం వారహ్యై నమః"**

**జయము అంజనీ ప్రియసుత జయము నీకు**
**జయము ధీరమ్య చైతన్య జయము నీకు !**

**పద్యకథ వ్రాయ బూనంగ వాక్కు సహిత**
**వాక్పటిమనిడుమ దయను వాయుపుత్ర !!**

శీతాకాలం సెలవులు కావడంతో, తొమ్మిదేళ్ళ వయసున్న దుర్గ, తన వద్దనున్న బొమ్మలకు,చక్కగా స్నానాలు చేయించి, జడలు వేసి, రంగు రంగుల జడపిన్నులతో ముస్తాబు చేస్తోంది. అమ్మ చెప్పిన చిన్న చిన్న శ్లోకాలను తనలో తాను వల్లె వేసుకుంటోంది. వంటగదిలో హడావుడిగా పని చేసుకుంటున్న దుర్గ తల్లి... శ్రీకరికి దుర్గ చెప్పుకుంటున్న శ్లోకాలు, పద్యాలు చెవినిబడ్డాయి. తనలో తాను చాలా సంతోషించింది. 'నేర్పినవన్నీ ఎంత చక్కగా గుర్తుంచుకున్నది!' అని ఆలోచిస్తూ, తన పని తను చేసుకుంటూ ఉండగా, శ్రీకరికి ఒక ఆలోచన తట్టింది. ఈ సెలవులలో ఎలాగైనా తన కుమార్తె దుర్గకి, 'హనుమాన్ చాలీసా' నేర్పాలని అనుకుంది. చిన్నప్పటినుండీ ఉత్తర భారతంలో పెరగడం వలన దుర్గకి, తన అన్నయ్య శ్రీరాంకి తెలుగు చదవడం, వ్రాయడం రాదు. అమ్మానాన్నలు శ్లోకాలు, పద్యాలు చెబుతూంటే వినికిడి ద్వారా నేర్చుకునేవారు. దుర్గ నాల్గవ తరగతిలో, తన అన్నయ్య శ్రీరాం 11వ తరగతిలో చదువుకుంటున్నారు. వీరి నాన్నగారైన శ్రీనివాస్ ఒక ఐటీ సంస్థలో మేనేజరుగా పని చేస్తున్నారు. వీరు, దేశ రాజధానియైన హస్తినాపురము సమీపమునున్న 'గురుగ్రామ్' లో నివసించేవారు. అక్కడ ఎప్పుడూ, అన్ని కాలాలలోనూ,విపరీత వాతావరణములు ఉండేవి.

అమ్మ శ్రీకరి ఫిజియోథెరపిస్టు.కానీ, కుటుంబమే తన ప్రపంచమనుకుని ఇంటిపట్టునే ఉండేది. దుర్గకి నాలుగేళ్ల వయసునుండి శ్లోకాలు, చిన్న చిన్న పద్యాలు నేర్పడం మొదలు పెట్టింది శ్రీకరి. అమ్మ, నాన్న, అన్నయ్యల ప్రేమతో ముద్దుగా గారాలపట్టియై, ఎదగ సాగింది దుర్గ.

తే: **అమ్మ,నాన్నల పట్టియై యందముగను**
**అన్న గారాల చెల్లియై యనువుగాను**
**పేర్మిగ నెదగ సాగెను బెళుకు తోడ**
**జదువులందున నిలచియు సాటి లేక!**

ఇలా సాగుతూ ఉండగా, దుర్గ వాళ్ళమ్మ శ్రీకరి, అనుకున్నట్టుగా హిందీలో హనుమాన్ చాలీసా తీసుకుని వచ్చి రోజూ దుర్గతో పారాయణం చేయించడం మొదలు పెట్టింది. మూడు నాలుగు రోజులు అమ్మ సహాయము చేసాక,దుర్గ తనంతట తాను స్పష్టముగా చదవడం మొదలు పెట్టింది. దుర్గ యొక్క ధారణాశక్తి పెంచటానికి, దుర్గ వాళ్ళ నాన్నగారు ఆమె, “నువ్వు రోజుకి ఐదు సార్లు, ఐదు రోజులు పారాయణం చేస్తే తప్పక హనుమ వచ్చి నీ చేతితో అరటిపండు తింటాడు” అని చెప్పారు. “అవునా నాన్నా!” అంటూ, ఆనందంతో ఎగిరి గంతువేసింది దుర్గ.

ఆ మరుసటి ఉదయం నుండి, ఎంతో ఉత్సాహంగా రోజుకి ఐదు మార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేయడం మొదలు పెట్టింది, దుర్గ. రెండు రోజులలో చక్కగా ధారణ చేసుకుంది. ‘ఎప్పుడెప్పుడు ఐదు రోజులు అయిపోతాయా, ఎప్పుడు హనుమ వస్తాడా’ అని... ఆత్రుతగా ఎదురు చూడసాగింది. దుర్గ ఆత్రుత చూసి వాళ్ళ అమ్మ కొద్దిగా కంగారుపడింది. చలికాలం కావడం వలన (2- 3 డిగ్రీల చలిలో) ‘ఇంత చలిలో మనకు అసలు హనుమ కనబడుట సాధ్యమా, మన యింటికి వచ్చి దుర్గ చేతితో ఫలము తీసుకోవడం జరుగుతుందా’ అని, కానీ తను కూడా హనుద్భక్తురాలు కావడంతో దృఢవిశ్వాసంతో అందరూ ఎదురు చూడసాగారు.

ఇలా జరుగుతుండగానే, వారనుకున్న ఐదు రోజుల వ్యవధి పూర్తి అయినది. కానీ, ఐదవ రోజు మొత్తం ఎదురు చూసినా హనుమ రాలేదు. అలా ఆరవ రోజు కూడా గడిచిపోయింది. దుర్గ చాలా నిరాశ చెందింది. ఏడవ రోజు ఉదయము లేవగానే, పెరటిలోకి వెళ్ళిన దుర్గ నాన్నగారు శ్రీనివాస్ గట్టిగా కేక వేసారు, “శ్రీకరీ ఇదిగో హనుమ వచ్చారు!” అంటూ. వారందరూ పరుగు పరుగున పెరట్లోకి వెళ్ళి చూసాక, వారి ఆశ్చర్యానందములకు

అవధులు లేవు. పరుగు పరుగున అందరూ ఒక్కొక్క అరటిపండు అందించారు, స్వామి వారు తృప్తిగా తిని వెళ్ళిపోయారు.



**భక్తి తోడను బిలువగ పవనసుతుడు**
**సంతసమునరుదెంచును జాగులేక**
**నిక్కమగు భక్తి చాలును నిక్కముగను**
**యనుచు రూఢి జేసె హనుమ ద్భుతముగ!!**

ఇంతటి అదృష్టం లభించినందుకు వారందరూ ఎంతో సంతోషించారు. ఆ రోజు మొత్తం అవే కబుర్లు చెప్పుకుంటూ, వారి తల్లిదండ్రులకు ఫోను చేసి, ఈ వివరములను తెలుపుతూ, ఎంతో సంబరముగా గడిపారు. మరుసటి ఉదయం పెరట్లో బట్టలు ఆరేయడానికి వెళ్ళిన శ్రీకరికి, మళ్ళీ హనుమ కనుబడటంతో ఎంతో సంతోషముతో ఫలములు, నీరు అందించింది. అలా హనుమ వారింటికి నిత్య అతిథి అయ్యాడు. వారు ఆయనకు 'అంజి' అని పేరు పెట్టుకున్నారు. ఇలా వారు ప్రతిదినము అంజికి ఆహారము పెట్టడం అటు, ఇటు ఇళ్ళ వాళ్ళకు నచ్చలేదు. వాళ్ళ పక్కింటి ఆవిడ (సంతోషి) శ్రీకరిని పిలిచి, "మీరు ఆ కోతికి ఆహారం ఇవ్వకండి" అని హెచ్చరించింది. కానీ, దుర్గ కుటుంబం మాత్రం అంజి కనబడగానే, ఉత్సాహాన్ని ఆపుకోలేకపోయేవారు. దుర్గ నాన్నగారు శ్రీనివాస్, అంజికి సైగ చేసి, మేడ పైకి పిలిచి, ఎవరి కంటపడకుండా ఆహారం తినిపించి, పంపేయడం మొదలుపెట్టారు.

కానీ పొరపాటున అంజి పెరటి గోడ మీద కనబడితే, రాళ్ళు, కట్టెలు పెట్టి కొట్టడం మొదలుపెట్టారు. వాళ్ళ వెనుక ఇంటిలో ఒక పెద్దావిడ నివసించేది. అంజి ఆవిడ మొక్కలను పాడు చేస్తాడేమోనని భయముతో, ఆవిడ ఎయిర్ గన్ తో కాల్చడం మొదలు

పెట్టింది. ఇవన్నీ చూసిన దుర్గ పసి హృదయం ఎంతో బాధపడింది. “గుడిలో హనుమను చూస్తే, అందరూ ఎంతో భక్తితో పూజచేస్తారు కానీ, ఇలా ఇంటికి వచ్చి ఎవరికీ ఇబ్బంది కలుగకుండా ఆహారం తిని వెళ్తుంటే, ఎందుకమ్మా మన అంజిని అందరూ కొడుతున్నారు?” అని బాధపడింది. వారి ఇంటిలోనున్న మందిరము వద్దకు వెళ్ళి హనుమతో మాట్లాడసాగింది.



**ఆలయమునగనగ నిన్ను యాదరించి**
**పూజలు సలిపెదరు దేవ, పుణ్యమనుచు**
**బాహ్యమున గనినంతనె వానరమని**
**తరిమి గొట్టెదరు జనులు, దైవమనక!!**

అని ఏడుస్తూ బాధపడ సాగింది, చిన్నారి దుర్గ. ఇలా బాధపడుతున్న దుర్గని చూసిన శ్రీకరి ఆమెను ఓదార్చి, చక్కగా భోజనం తినిపించి, పడుకోబెట్టింది. నిదురలో దుర్గకు హనుమ దర్శనమిచ్చి, ఇకపై తను కనబడనని కానీ ఎల్లప్పుడూ ఆమె తోనే ఉంటానని చెప్పి, ఒకసారి వారి పెరటి తోటలో ఉన్న అరటిచెట్టు దగ్గర చూడమని చెప్పి అంతర్ధానమయ్యాడు. నిద్ర లేవగానే దుర్గమ్మ,వాళ్ళమ్మ దగ్గరికి పరుగులు తీసింది. “ఏమైంది, ఎందుకిలా హడావుడిగా పరుగులు తీస్తూ వచ్చావు?” అని కంగారుగా అడిగిన శ్రీకరికి, “అమ్మా! అంజి నాకు కలలో కనబడ్డాడు. ఇకపై తను మన ఇంటికి రానని, కానీ ఎప్పుడూ నాతోనే ఉంటానని చెప్పాడు” అని చెబుతూ, ఏదో గుర్తుకొచ్చినట్టు పెరటిలోకి పరుగులు తీసింది. ఎందుకలా పరుగెడుతోందో అర్థం కాక శ్రీకరి కూడా దుర్గ వెనుకే పరుగులు తీసింది.

అరటి చెట్టు, దగ్గర అటూ ఇటూ, ఏదో వెతుకుతున్న దుర్గ దగ్గరికి వచ్చి, “ఏమి చూస్తున్నావురా పండూ?” అని అడిగింది శ్రీకరి. “అరటిచెట్టు వద్ద ఒకసారి చూడమని చెప్పాడమ్మా అంజి!” అని జవాబు ఇచ్చింది దుర్గ. ఇద్దరూ, కాసేపు ఆ పొదల నడుమ,

అరటిచెట్టు మొదళ్ళలో వెదుకగా, వారికి ఒక చిన్న హనుమ ప్రతిమ దొరికింది. అమితమగు సంభ్రమాశ్చర్యాలతో, ఆ ప్రతిమను తీసుకెళ్ళి, శ్రీనివాస్ కి, శ్రీరాంకి చూపెట్టారు. అందరూ కలిసి ఆ ప్రతిమను వారి ఇంటనున్న మందిరమున ఉంచి, హనుమకి అంజలి ఘటించారు. వారి జీవన పర్యంతము, హనుమ భక్తులై, ఆయన సేవలోనే జీవితాన్ని వెళ్ళబుచ్చారు.

**సీ:**

**ప్రాంజలి హనుమంత! వజ్రకాయ!విజిత! యోవీర! యోశూర! యోగి రూప**
**ప్రణతి మహాబల! పవనాత్మజ!సురసేవిత!మనోజవ! భవ్య విశ్వ పూజ్య**
**కైమోడ్పు కపివీర! కామిత ఫలదాత! అంజనీ నందనా!ఆంజనేయ!**
**నతులు గైకొనుమ వానర సైన్య శ్రేష్ఠమా! రామ సేవిత  ధీర రామదూత!**

**తే:**

**శక్తి సాయుజ్య సంప్రాప్య సాధనములు**
**పవనసుత! నీదు సలలిత పదములేను**
**యట్టి నీ చరణములకు ఆరజముగ**
**యంజలి నొసగెదము దేవ యభయ మిడుము!!**

అనుచు వారి జీవన పర్యంతము హనుమ భక్తుల
అలా వారి భక్తికి సంతసించిన ఆంజనేయుడు ఎప్పటికీ వారికి అండగా వారితో నిలిచిపోయాడు. నిర్మలమగు భక్తివిశ్వాసములు యున్న, ఏ యుగమైనా, భగవంతుడు భక్తులకు దాసోహమౌతాడు అని కేసరీ నందనుడు రూఢి జేసాడు.

జై శ్రీ రాం 🙏
జై శ్రీ ఆంజనేయం 🙏